www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

మంగళవారం
12-05-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 129

MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

- ఆయన కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి!
- వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు
- మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

2 లో





# అన్నదాతపై తరుగు దోపిడీ!

- సంచికి కిలో నుంచి మూడు కిలోల వరకు కోత
- తరుగు ఇస్తేనే అన్‌లోడ్.. లేదంటే లారీ వెనక్కే
- ఒక్కో లారీపై రూ. 12 వేల వరకు అక్రమ లాభం..
- జిల్లావ్యాప్తంగా సాగుతున్న భారీ కుంభకోణం
- వర్షాల భయంతో గత్యంతరం లేక మౌనంగా విలపిస్తున్న రైతాంగం
- ఐకేపీ, ట్రాన్స్‌పోర్ట్, మిల్లర్ల మధ్య 'అక్రమ' బంధం..
- క్షేత్రస్థాయిలో పెచ్చుమీరిన వసూళ్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

### ఐకేపీ కేంద్రాల్లో కోట్లలో మాయాజాలం

### మిల్లుల వద్ద మిల్లర్ల దౌర్జన్యం

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్నదాతల పాలిట 'అగ్నిపరీక్ష'గా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వస్తే, అక్కడ నుండి రైస్ మిల్లుకు వెళ్లే వరకు అడుగడుగునా దోపిడీయే కనిపిస్తోంది. "తరుగు" అనే ఒకే ఒక పదాన్ని అడ్డు పెట్టుకుని మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు కుమ్మక్కై సామాన్య రైతులను నిలువునా ముంచుతున్నారు. ఈ వ్యవహారం వెనుక కోట్ల రూపాయల కుంభకోణం జరుగుతోందన్న ఆరోపణలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. (మెదక్ ప్రతినిధి-సిరి న్యూస్)

వివరాలు 5 లో



## అంతా వారి ఆధిపత్యమే!

### అధికారులు మారినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హవా ?

టౌన్ ప్లానింగ్ నుంచి పారిశుద్ధ్యం వరకు 'వారే కీలకం'

- కీలక విభాగాల్లో ఏళ్ల తరబడి ఒకే సిబ్బంది కొనసాగింపుపై విమర్శలు
- కార్యాలయ వ్యవహారాల్లో అధికారులకంటే వారిదే అధిక ప్రభావమన్న చర్చ
- అవినీతి, రాజకీయ లీకేజీల ఆరోపణలతో ఉద్యోగ వర్గాల్లో కలకలం
- సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్

4 లో

(రేపటి సంచికలో మరో కథనం...)

## మెదక్‌లో మారు ముఖచిత్రం




### కలెక్టర్ దూకుడుతో పరుగులు తీస్తున్న పరిపాలన

- ఫైళ్లకే పరిమితమైన పాలనకు ఫుల్ స్టాప్
- గ్రామాల్లోకి దిగిన జిల్లా యంత్రాంగం
- ప్రజల సమస్యలపై స్పాట్‌లోనే నిర్ణయాలు
- అధికారుల్లో పెరిగిన జవాబుదారీతనం
- సోషల్ మీడియాలోనూ ప్రశంసల వెల్లువ

ప్రత్యేక ప్రతినిధి, మే11(సిరి న్యూస్) మెదక్ జిల్లాలో ఇప్పుడు పరిపాలన అంటే కేవలం కార్యాలయాలకే పరిమితమయ్యే వ్యవస్థ కాదనే భావన బలపడుతోంది. జి ల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, ఫీల్డ్ స్థాయిలో చేస్తున్న పర్యటనలు, ప్రజల సమస్యలపై చూపుతున్న చొరవతో జిల్లా పరిపాలనకు కొత్త ఊపు వచ్చినట్లు ప్రజలు అభిప్రాయపడుతు న్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రస్తుతం ఎక్కు వగా వినిపిస్తున్న చర్చ వ్యవస్థ కదులుతోంది అన్నదే.

వివరాలు 3 లో



# రామాయంపేట అభివృద్ధి వెనుకబాటుకు బిఆర్ఎస్ కారణం

- నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్.
- సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
- మున్సిపల్
- ప్రత్యేక సమావేశంలో శంకర్ గౌడ్ ఆరోపణలు.




**రామాయంపేట, మే 11( సిరి న్యూస్)** సోమవారం నాడు జరిగిన రామాయంపేట మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో 8వ వార్డు కౌన్సిలర్ జె. శంకర్ గౌడ్ స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గళమెత్తారు. పట్టణంలోని పలు కీలక అంశాలతో పాటు ప్రధానంగా 8వ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీస్ స్టేషన్ నుండి పోస్ట్ ఆఫీస్ వరకు 40 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం చేయాలని, తక్షణమే మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రహదారి విస్తరణ వల్ల ఇళ్లు, వ్యాపారాలు కోల్పోయి నష్టపోయే బాధితులకు ప్రభుత్వం నుండి తగిన ఆర్థిక సహాయం అందేలా చూడాలని, ఎలాంటి జాప్యం లేకుండా పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు.

పట్టణంలోని బజాజ్ షోరూం ముందు సిద్దిపేట వెళ్లే రహదారిపై కొనసాగుతున్న పనుల నెమ్మది గమనంపై శంకర్ గౌడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఆలస్యమవ్వడం వల్ల వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ఈ పనులను పూర్తి చేయాలని హెచ్చరించారు. మున్సిపాలిటీలో గతంలో జరిగిన ఆర్థిక అక్రమాలపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కోటి రూపాయలకు పైగా దుర్వినియోగం అయ్యాయని ఆయన ఆరోపించారు. ఈ అవినీతిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిధుల గోల్మాల్ వల్ల ప్రజలు వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామాయంపేట పట్టణం ఆశించిన రీతిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. నేటి వెనుకబాటుతనానికి గత నాయకుల వైఖరే కారణమని ఆయన దుయ్యబట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, టీయూఎఫ్ఐడీసీ (TUFIDC) ద్వారా మంజూరైన నిధులతో చేపట్టే పనులను వేగవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మున్సిపల్ సమావేశం వేదికగా డిమాండ్ చేశారు.

# లక్ష్యంతో చదివితే విజయం సాధ్యం

- మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారంతో విద్యార్థినికి, తల్లిదండ్రులకు, ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం
- పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన తేజస్విని
- విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్న ప్రముఖులు

**గుమ్మడిదల, మే 11( సిరి న్యూస్) :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించడం ద్వారా తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రముఖులు సూచించారు. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారాలు-2026 కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 565 మార్కులు సాధించిన విద్యార్థిని తేజస్విని తో పాటు తల్లిదండ్రులను, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, బిసిటిసి సంఘ ప్రతినిధులు విద్యార్థిని, ప్రధానోపాధ్యాయురాలికి శాలువా కప్పి మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు పట్టుదలతో చదివి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకం, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల సహకారంతో ఉన్నత ఫలితాలు సాధించగలరని నిరూపితమైందన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు రావడానికి విద్యార్థుల కష్టపడే తత్వం, ఉపాధ్యాయుల నిరంతర శ్రద్ధ, తల్లిదండ్రుల ప్రోత్సాహం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఆమె సూచించారు. విద్యార్థిని తేజస్విని మాట్లాడుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే తన విజయానికి కారణమని తెలిపింది. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే స్థాయికి చేరుకోవాలని తన లక్ష్యమని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పుట్నాల భాస్కర్ పాల్గొన్నారు.




# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

- ఆయన కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి!
- -వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు
- -మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

**రామాయంపేట, మే 11 (సిరి న్యూస్)** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భరత్‌పై పోక్సో కేసు నమోదై 72 గంటలు గడుస్తున్నా ఇంతవరకు అరెస్టు చేయకపోవడం పట్ల మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తీరును తప్పుబట్టారు. తన మంత్రి పదవిని అడ్డుపెట్టుకొని బండి సంజయ్ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని సుభాష్ రెడ్డి ఆరోపించారు. కుమారుడి అరాచకాలను కప్పిపుచ్చుకోవాలని చూడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో ఇతరుల విషయంలో కఠిన శిక్షలు డిమాండ్ చేసిన బండి సంజయ్‌కు, ఇప్పుడు తన సొంత కుమారుడి అరాచకం ఎందుకు కనిపించడం లేదని ఆయన నిలదీశారు. జనాలకు ఒక నీతి, తన కొడుకుకు ఒక నీతి అన్నట్లుగా వ్యవహరించడం జుగుప్సాకరమని విమర్శించారు.




## కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందం

రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని సుభాష్ రెడ్డి ప్రశ్నించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపే ముఖ్యమంత్రికి, కేంద్ర మంత్రి కుమారుడిపై నమోదైన పోక్సో కేసు ఎందుకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందంతో ఒకరికొకరు లొంగిపోయారని ఆయన ఆరోపించారు.

## ప్రధాని సమాధానం చెప్పాలి

నిందితుడి తండ్రితో కలిసి ప్రధానమంత్రి మోదీ అధికారిక వేదికను పంచుకోవడం బాధితులకు ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో వివరించాలని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి డిమాండ్ చేశారు. "బేటీ బచావో" అన్న నినాదం ఇప్పుడు "బేటా బచావో" గా మారిందని ఎద్దేవా చేశారు. సామాన్యులు ఇలాంటి కేసుల్లో ఉంటే పోలీసులు ఇదే విధంగా వ్యవహరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పదవి నుండి బండి సంజయ్‌ను వెంటనే తొలగించాలని శేరి సుభాష్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే నిందితుడు బండి భరత్‌ను తక్షణమే అరెస్టు చేసి, బాధితురాలి కుటుంబానికి సరైన రక్షణ కల్పించాలని కోరారు. పోక్సో కేసులో ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన స్పష్టం చేశారు.

# మెదక్ లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

**మెదక్ ప్రతినిధి, మే 11(సిరి న్యూస్)** మెదక్ లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని ఈ విద్యాలయం ద్వారా నిరుపేద విద్యార్థులకు సీబీసీ సిలబస్ తోపాటు మంచి విద్యను అందించాలని, మెదక్ పట్టణంలో వివిధ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ మెదక్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో కలెక్టర్ ప్రతిమ సింగ్ కు వినతి పత్రములు సమర్పించడం జరిగిందని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ లో కేంద్రీయ విద్యాలయ పాఠశాలను ప్రారంభించాలన్నారు. స్టేడియంలో తాగునీటి సౌకర్యం మూత్రశాలలను ఏర్పాటు చేయాలని, మెదక్ పట్టణంలో డిగ్రీ కళాశాల, ధ్యాన్ చంద్ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్ , నర్సాపూర్ చౌరస్తా , మెడికల్ కళాశాల , మాత శిశు సంరక్షణ కేంద్రాల వద్ద బస్ షెల్టర్లను నిర్మించాలని డిమాండ్ చేశారు మెదక్ పట్టణంలో గల మల్లెం చెరువు, గోసముద్రం, పిట్లం చెరువు ఎఫ్ టి ఎల్ ను నిర్ధారించి ఆక్రమణలను తొలగించాలన్నారు. రాయిన్ పల్లి చెరువు నుండి మెదక్ పట్టణంలో గల చెరువులకు వచ్చే నీటిపారుదల కాలువలకు సిమెంట్ లైనింగ్ చేయాలని, కాళేశ్వరం లో భాగంగా శంకరంపేట మండలంలోని కాలువలను పూర్తి చేసి చెరువులను నింపేటటువంటి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ సిటిజన్ ఫోరం సభ్యులు పి.డి. ఆనందం, బాలేష్ గౌడ్ ,కానుగు రాజశేఖర్ , రామ్ కిషన్, డి. జీవరత్నము లు పాల్గొన్నారు.




# 'మెదక్‌లో మార్పు ముఖచిత్రం'

## కలెక్టర్ దూకుడుతో పరుగులు తీస్తున్న పరిపాలన

- ఫైళ్లకే పరిమితమైన పాలనకు ఫుల్ స్టాప్
- గ్రామాల్లోకి దిగిన జిల్లా యంత్రాంగం
- ప్రజల సమస్యలపై స్పాట్‌లోనే నిర్ణయాలు
- అధికారుల్లో పెరిగిన జవాబుదారీతనం
- సోషల్ మీడియాలోనూ ప్రశంసల వెల్లువ

**ప్రత్యేక ప్రతినిధి, మే11(సిరి న్యూస్)** మెదక్ జిల్లాలో ఇప్పుడు పరిపాలన అంటే కేవలం కార్యాలయాలకే పరిమితమయ్యే వ్యవస్థ కాదనే భావన బలపడుతోంది. జి ల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, ఫీల్డ్ స్థాయిలో చేస్తున్న పర్యటనలు, ప్రజల సమస్యలపై చూపుతున్న చొరవతో జిల్లా పరిపాలనకు కొత్త ఊపు వచ్చినట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న చర్చ వ్యవస్థ కదులుతోంది అన్నదే.

### "ప్రజల మధ్యే పరిపాలన" కొత్త వర్కింగ్ స్టైల్‌కు ప్రశంసలు

జిల్లాలో కలెక్టర్ పని తీరుపై ప్రజల్లో విపరీతమైన చర్చ సాగుతోంది. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యలు ఇప్పుడు వేగంగా పరిష్కారమవుతున్నాయని బాధితులు చెబుతున్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం వినతుల స్వీకరణకే





పరిమితం చేయకుండా, సమస్య పరిష్కార వేదికగా మార్చారని ప్రజలు అంటున్నారు.ప్రతి ఫిర్యాదును నేరుగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం వల్ల పెండింగ్ వ్యవహారాలు తగ్గుతున్నాయని సమాచారం. ముఖ్యంగా రెవెన్యూ, భూ భారతి , భూ వివాదాలు, పెన్షన్లు, రేషన్, తాగునీటి సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారని చెబుతున్నారు.

### ఆకస్మిక పర్యటనలతో అధికారుల్లో అలర్ట్

"మేడం వస్తున్నారు" అంటే చాలు అధికారులు పరుగులుతీస్తున్నారు. జిల్లాలో కలెక్టర్ ఆకస్మిక పర్యటనలు ఇప్పుడు అధికార యంత్రాంగంలో హాట్ టాపిక్‌గా మారాయి. ముందస్తు సమాచారం లేకుండానే గ్రామాల్లో పర్యటిస్తూ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నారని తెలుస్తోంది. మధ్యాహ్న భోజనం నాణ్యత నుంచి ఆసుపత్రుల్లో మందుల లభ్యత వరకు ప్రతీ అంశాన్నిస్వయంగా పరిశీలించడం వల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. "పని చేయక తప్పదు" అనే పరిస్థితిని కలెక్టర్ తీసుకొచ్చారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ఫీల్డ్‌లోనే నిర్ణయాలు ప్రజలకు తగ్గిన కార్యాలయాల చుట్టూ తిరుగుడు సమస్య చెప్పిన వెంటనే స్పందించడం కలెక్టర్ పని తీరులో ప్రధాన ప్రత్యేకతగా మారిందని ప్రజలుఅభిప్రాయపడుతున్నారు. అనేక సందర్భాల్లో గ్రామాల్లోనే అధికారులతో మాట్లాడి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తున్నారని సమాచారం.దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తగ్గిందని చెబుతున్నారు. "సమస్య చెప్పితే స్పందన వస్తోంది" అనే నమ్మకం ప్రజల్లో పెరిగిందని సామాజిక వర్గాలు అంటున్నాయి.

### రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి, భూభారతి , సాగునీరు, పంటలపై సమీక్షలు

వ్యవసాయ రంగంపై కూడా కలెక్టర్ ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. రైతుల భూ సమస్యలు, భూభారతి ఇబ్బందులు, సాగునీటి కొరత, పంట నష్టాల అంశాలపై ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని సమాచారం."రైతు కార్యాలయానికి రావడం కాదు... వ్యవస్థ రైతు వద్దకు వెళ్లాలి" అనే విధానంతో పని చేస్తున్నారని రైతు సంఘాలు చెబుతున్నాయి. రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు సమయానికి చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని తెలుస్తోంది.

### విద్య, వైద్యంపై ప్రత్యేక ఫోకస్.. ప్రభుత్వ సేవల్లో మార్పు స్పష్టమంటున్న ప్రజలు

ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పనితీరుపై కూడా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలుస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతపై నేరుగా పరిశీలన జరుగుతుండగా... ఆసుపత్రుల్లో వైద్య సేవలపై పర్యవేక్షణ పెరిగిందని సమాచారం.దీంతో ప్రభుత్వ సేవల్లో మార్పు కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. "సమీక్షలే కాదు... ఫలితాలు కూడా కనిపిస్తున్నాయి" అని పలువురుఅభిప్రాయపడుతున్నారు.

### అభివృద్ధి పనుల్లో స్పీడ్.. నాణ్యతపై రాజీ లేదంటున్న కలెక్టర్

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కూడా కలెక్టర్ కఠినంగా వ్యవహరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు, తాగునీటి పనులపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనుల్లో నాణ్యత తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారని సమాచారం.పనుల్లో జాప్యం జరిగితే వివరణ కోరడం, నాణ్యతలో లోపాలు ఉంటే హెచ్చరికలు జారీ చేయడం వల్ల కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తమయ్యారని తెలుస్తోంది.

### సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పని తీరు

"ప్రజల కలెక్టర్ ప్రతిమా సింగ్ " అంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లాలో కలెక్టర్ ఫీల్డ్ విజిట్లు, ప్రజలతో మాట్లాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "యాక్షన్ కలెక్టర్", "ప్రజల కలెక్టర్", "ఫీల్డ్ ఆఫీసర్" అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ప్రజల సమస్యలను హ్యూమన్ యాంగిల్‌తో చూడటం, స్పందనలో వేగం చూపించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### "వ్యవసలో కదలిక... ప్రజల్లో నమ్మకం" మెదక్‌లో కొత్త పరిపాలన శైలికి ప్రజల మద్దతు

ప్రజల మధ్యకు వెళ్లే పరిపాలన, అధికారుల్లో జవాబుదారీతనం, సమస్యలపై వేగవంతమైన స్పందన ఇవన్నీ కలిసి మెదక్ జిల్లాలో కొత్త పరిపాలన సంస్కృతికి దారితీస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.

ఇప్పుడు జిల్లాలో వినిపిస్తున్న ఒక్క మాట "కలెక్టర్ వస్తే... సమస్య కదులుతోందనే చర్చ హాట్ టాపిక్ గా మారింది.





# అంతా వారి ఆధిపత్యమే!

**అధికారులు మారినా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హవా ?**

- కీలక విభాగాల్లో ఏళ్ల తరబడి ఒకే సిబ్బంది కొనసాగింపుపై విమర్శలు
- కార్యాలయ వ్యవహారాల్లో అధికారులకంటే వారిదే అధిక ప్రభావమన్న చర్
- అవినీతి, రాజకీయ లీకేజీల ఆరోపణలతో ఉద్యోగ వర్గాల్లో కలకలం
- సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్

**టౌన్ ప్లానింగ్ నుంచి పారిశుద్ధ్యం వరకు 'వారే కీలకం'**

(రేపటి సంచికలో మరో కథనం...)

**రామచంద్రపురం, మే 11 (సిరి న్యూస్):** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని తెల్లాపూర్ డివిజన్‌లో కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధిపత్యం రోజురోజుకూ పెరుగుతోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ కాలం నుంచి ఇప్పటి వరకు పలువురు అధికారులు మారినా కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రభావం మాత్రం ఏమాత్రం తగ్గలేదని స్థానికులు, తోటి ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో కొందరు చెప్పిందే చట్టంలా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కార్యాలయాల్లో అధికారులకంటే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందని, బయట పనులు చక్కబెట్టే వారికే ఉన్నతాధికారుల అండ ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వారి ప్రభావానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోందని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## అధికారులకంటే వారిదే పవర్'..?

కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రభావం అధికారులను మించిపోయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. శాఖల్లో జరిగే కీలక వ్యవహారాలన్నింటిలోనూ వారే ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై అనేక అవినీతి ఆరోపణలు ఎదురవుతున్నప్పటికీ ఇప్పటికీ అదే విభాగంలో కొనసాగించడం ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ కాలంలో కాగితాలపై ఇతర శాఖలకు బదిలీ చేసినట్లు చూపించి, తిరిగి అదే విభాగంలో విధులు నిర్వహించేలా అవకాశం కల్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫైళ్ల వ్యవహారాలపై పూర్తి పట్టు ఉండటంతో కొందరు అధికారులు కూడా వారికే అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## బ్యాంకు లావాదేవీలపై అనుమానాలు..?

కొంతమంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక లావాదేవీలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కొందరి బ్యాంకు లావాదేవీలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అధికారులతో పాటు వీరి వ్యవహారాలపై కూడా విజిలెన్స్ దృష్టి సారించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## రాజకీయ లీకేజీల ఆరోపణలు...

కార్యాలయాల్లో జరిగే అంతర్గత విషయాలను కొందరు రాజకీయ నాయకులకు చేరవేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కార్యాలయ వ్యవహారాలు బయటకు వెళ్లడం వెనుక కొందరు ఔట్‌స ోర్సింగ్ ఉద్యోగుల పాత్ర ఉందన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## మాకు అవకాశాలు లేవు...

ఇతర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం తమకు శాఖల మార్పులు ఇవ్వాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరినే కీలక విభాగాల్లో కొనసాగించడం వల్ల కార్యాలయాల్లో అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి, ఒకే చోట సంవత్సరాలుగా కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పరిస్థితి మరింత అదుపు తప్పే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.





# అన్నదాతపై తరుగు దోపిడీ!



## ఐకేపీ కేంద్రాల్లో కోట్లలో మాయాజాలం

## మిల్లుల వద్ద మిల్లర్ల దౌర్జన్యం

- సంచికి కిలో నుంచి మూడు కిలోల వరకు కోత
- తరుగు ఇస్తేనే అన్‌లోడ్.. లేదంటే లారీ వెనక్కే
- ఒక్కో లారీపై రూ. 12 వేల వరకు అక్రమ లాభం..
- జిల్లావ్యాప్తంగా సాగుతున్న భారీ కుంభకోణం
- వర్షాల భయంతో గత్యంతరం లేక మౌనంగా విలపిస్తున్న రైతాంగం
- ఐకేపీ, ట్రాన్స్‌పోర్ట్, మిల్లర్ల మధ్య 'అక్రమ' బంధం..
- క్షేత్రస్థాయిలో పెచ్చుమీరిన వసూళ్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్నదాతల పాలిట 'అగ్నిపరీక్ష'గా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వస్తే, అక్కడ నుండి రైస్ మిల్లుకు వెళ్లే వరకు అడుగడుగునా దోపిడీయే కనిపిస్తోంది. "తరుగు" అనే ఒకే ఒక పదాన్ని అడ్డుపెట్టుకుని మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు కుమ్మక్కై సామాన్య రైతులను నిలువునా ముంచుతున్నారు. ఈ వ్యవహారం వెనుక కోట్ల రూపాయల కుంభకోణం జరుగుతోందన్న ఆరోపణలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి.** (మెదక్ ప్రతినిధి-సిరి న్యూస్)

### తరుగు పేరుతో మిల్లర్ల దౌర్జన్యం..

ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసి, లారీల్లో ఎక్కించిన ధాన్యం మిల్లులకు చేరగానే అసలు సినిమా మొదలవుతోంది. రైతులు తమ ధాన్యం ఎప్పుడు దించుకుంటారా అని వేచి చూస్తున్న సమయంలో మిల్లర్లు కొత్త నిబంధనలు తెరపైకి తెస్తున్నారు. ధాన్యంలో తాలు ఎక్కువగా ఉంది.. ముక్క రకం వడ్లు వచ్చాయి.. కాబట్టి సంచికి మూడు కిలోలు తరుగు తీయాల్సిందే అని భీష్మిస్తున్నారు. రైతులు ప్రాధేయపడినా వినకుండా, "ఇష్టం ఉంటే ఇక్కడ దించుకోండి, లేదంటే మీ వడ్లు మీరే పట్టుకెళ్లండి" అని ముఖం మీదే చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.

### చిన్న రైతుల నడ్డి విరిచే కుట్ర..

ఈ దోపిడీలో చిన్న రైతులు అత్యధికంగా నష్టపోతున్నారు. సాధారణంగా ఒక లారీలో ఐదు నుంచి ఆరుగురు రైతుల ధాన్యం కలిసి ఉంటుంది. పెద్ద రైతులు తమ ధాన్యం త్వరగా అమ్ముడుపోవాలని, వర్షాల భయంతో సరే.. కిలో తరుగు తీసుకోండి అని ఒప్పుకుంటున్నారు. కానీ, కేవలం 20 లేదా 30 బస్తాలు మాత్రమే ఉన్న చిన్న రైతుకు సంచికి కిలో చొప్పున తీయడం అంటే కోలుకోలేని దెబ్బ. రెక్కాడితే గానీ డొక్కాడని మా బతుకుల్లో కిలోల కొద్దీ ధాన్యాన్ని మిల్లర్లకు ధారపోస్తే మాకు మిగిలేది ఏంటి? అని వారు కన్నీరు పెట్టుకుంటున్నారు. చిన్నరైతుల నిరసన వల్ల లారీలు మిల్లుల ముందే రోజులు తరబడి నిలిచిపోతున్నాయి.

### రూ. కోట్లలో అక్రమ లాభం..

తరుగు దోపిడీ వెనుక ఉన్న లెక్కలు విస్తుగొలుపుతున్నాయి. ఒక లారీ లెక్క సగటున ఒక లారీలో 500 బస్తాల ధాన్యం ఉంటుంది. మిల్లర్ల లాభం సంచికి ఒక కిలో చొప్పున తరుగు తీసినా, ఒక లారీకి 500 కిలోలు (అంటే 5 క్వింటాళ్లు) ధాన్యం మిల్లర్లకు అదనంగా లభిస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే, ఒక్కో లారీపై సుమారు రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు అక్రమ లాభం మిల్లర్ల జేబుల్లోకి వెళ్తోంది. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ వందల లారీలు మిల్లులకు చేరుతున్నాయి. ఈ లెక్కన చూస్తే, ఒక్కో సీజన్‌లో కొన్ని కోట్ల రూపాయల రైతుల సొమ్ము అక్రమార్కుల పాలవుతోంది.

### ట్రాన్స్పోర్ట్ సిబ్బంది భయం..

మరోవైపు ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది, లారీ డ్రైవర్లు కూడా మిల్లర్లకు వంత పాడుతున్నారు. మిల్లుల వద్ద వడ్లు దించడంలో జాప్యం జరుగుతుంటే, దానికి రైతులనే బాధ్యులను చేస్తున్నారు. "త్వరగా తరుగుకు ఒప్పుకుని వడ్లు దించుకోండి.. లేదంటే లారీని మీ ఇంటి దగ్గర పోసి వెళ్తాం.. మాకు వేరే సెంటర్లలో చాలా పని ఉంది" అంటూ రైతులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారు. దీనివల్ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నెమ్మదిస్తోంది. ఒక లారీ మిల్లు వద్ద ఆగితే, కొత్తగా మరో కేంద్రం నుంచి ధాన్యం లోడ్ చేయడానికి వాహనం దొరకని పరిస్థితి ఏర్పడుతోంది.

### ఆధారాలున్నా.. అటువైపు చూడని యంత్రాంగం

రాంపూర్ రైస్ మిల్‌కు చెందిన మంజీరా ట్రేడర్స్ వంటి కొన్ని మిల్లుల్లో రైతులను మూడు రోజుల పాటు వేచి ఉంచి, చివరకు 'రెండు కిలోలు తరుగు' ఇస్తేనే దించుకుంటామని తెగేసి చెప్పిన ఆడియో రికార్డింగ్‌లు, కాల్ డేటా ఆధారాలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. మల్లయ్య అనే రైతు ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. రైతుల వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో తమ ధాన్యం తీసుకోరనే భయంతో వారు బహిరంగంగా ఫిర్యాదులు చేయడానికి జంకుతున్నారు. ఐకెపి కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది, మిల్లర్లు అంతా ఒకే గూటి పక్షులై రైతులను చుట్టుముట్టారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, తరుగు పేరుతో జరుగుతున్న ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా ప్రత్యేక బృందంతో విచారణ జరిపించాలని, రైతు కష్టాన్ని దోచుకుంటున్న మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

